# కోరగాని కోరిక

(మయూరి వీక్లీ, 9 మే, 1997)

---

వసుంధర, రామారావు సినిమాకు వెళ్ళాలని ఆ రోజు ఉదయమే నిర్ణయించుకున్నారు.

ఆఫీసు అయిపోగానే ఇంటికి చేరుకున్నాడు రామారావ్.

అతను వచ్చేసరికి అలంకరణ పూర్తి చేసుకుని కూర్చుంది వసుంధర. తను కట్టుకోదలచిన చీరె, దానిపైన మేచింగ్ బ్లౌజు వగైరాలు ఓ పక్కన పెట్టుకుంది.

భర్తకు నీళ్ళు వగైరాలు సిద్ధంచేసి డ్రెస్ మార్చుకోవాలని ఆమె అభిప్రాయం.

రామారావ్ స్నానం పూర్తి చేసుకుని వచ్చేసరికి కాఫీ కప్పు అందించింది.

"నేను చీరె మార్చుకుని వచ్చేస్తాను" అంటూ పక్కన పెట్టుకున్న బట్టలు చేతులోకి తీసుకుని గదిలోకి వెళ్ళబోయింది వసుంధర.

"ఆ చీర వద్దులే....వేరేది కట్టుకో" అన్నాడు రామారావ్.

"ఎ ..ఎందుకని"

"వద్దన్నానుగా....వినకూడదా."

"వినవన్నానా....ఎందుకో చెప్పకూడదా."

"అది వద్దు....వేరేది కట్టుకో."

"నేనదే కట్టుకుంటాను."

"వీల్లేదు."

"వీలుంది."

"వద్దని చెప్పాను....విను."

"కారణం అడిగాను....చెప్పండి."

"చెప్పకపోతే వినవా."

"చెప్పటానికి మీకేంటి అభ్యంతరం."

"నాకు ఇష్టం లేదు .. సరేనా."

"నాకు ఇష్టం."

"నాకు అందంగా కన్పించటం నీ కనీస కర్తవ్యం."

"నాకు నచ్చిన బట్టలు కట్టుకునే స్వేచ్ఛ నాకుండాలి."

"స్వేచ్ఛలు, స్వతంత్రాల గురించి అనవసరం."

"నాకు అవసరం."

"నాకూ అవసరమే."

"మీ డ్రెస్ గురించి నేనేం అభ్యంతరాలు చెప్పటంలేదే."

"అయినా ఇంత చిన్న విషయానికి నీ కెందుకు అంత పంతం "

"ఆ మాటే నేనూ అడిగితే."

"పంతం పడుతున్నది నువ్వు "

"కాదు మీరే."

"ఇంక మాటలనవసరం."

"మానుకోండి "

"ఇలా అయితే ఇక సినిమాకు వెళ్ళే ప్రసక్తే లేదు."

"నేనేం అడగలేదే వెళ్దామని."

"అడిగినా తీసుకువెళ్ళను."

"అడగను. అడగాల్సిన అవసరం లేదు, నేనే వెళ్తాను."

"వెళ్ళానికి వీల్లేదు "

"మీరెవరు చెప్పేందుకు."

'నీ మొగుడ్ని.'

'అయితే.'

'అయితే ఏమిటి నే చెప్పినట్లు వినాలి నువ్వు.'

'ఆ రోజులు ఏనాడో పోయినై.'

'ఎక్కడికీ పోలేదు.'

'అలాగే అనుకుంటూ కూర్చోండి.'

'కూర్చుంటాననుకోకు.'

'అయితే నిలబడండి. లేకపోతే పడుకోండి. మీ ఇష్టం, నే సినిమాకు వెళ్తున్నా.'

'వెళ్లు. వెళ్తే ఇక వెళ్ళటమే మళ్ళీ రావటం కుదర్దు.'

'బెదిరిస్తున్నారా'

'అలాగే అనుకో.'

'భయపడతాననుకుంటున్నారా.'

'నా అనుకోవటంతో నీకేంటి పని.'

'ఇక మాటలనవసరం .. నే వెళ్తున్నాను.' చెపూనే విసవిసా బయటకు నడిచిందామె, చీర మార్చుకునే.

పది నిమిషాల తర్వాత ఇంటికి తాళం వేసి బయల్దేరేడు రామారావ్.

'అపలీపూట ఇంటికే వెళ్ళను. ఎక్కడికి తిరిగి వస్తుందో, ఏం చేస్తుందో చూద్దాం....ఆడదానికి అంత పొగరా' కసిగా అనుకుంటూ స్కూటర్‌ను ఓ రెస్టారెంట్ ముందు నిలిపాడు అతను.

'సినిమాకు ఎప్పుడయినా వెళ్ళొచ్చు. విషయం అంతా ప్రవీణకు చెప్పి, ఈ పూట అసలు అక్కడే వుంటే సరి. తెల్లారేసరికి పిచ్చెక్కిపోయి, గాబరాపడ్తూ ఆయనే వెదుక్కుంటూ వస్తారు' ధీమాగా అనుకుని స్నేహితురాలింటికి చేరింది వసుంధర.

అనుకోకుండా ఇలా ఒంటరిగా వచ్చిన స్నేహితురాల్ని చూసి ఆశ్చర్యపోయిన ప్రవీణ అంతలోనే తేరుకుని....

ఏమిటే ఒంటరిగా వూడిపడ్డావ్. మీ శ్రీవారు ఏదైనా వూరు వెళ్లారేంటి' అనడుగుతూ ఎదురొచ్చి వసుంధరను లోపలకు తీసుకు వెళ్ళింది.

'వూళ్ళోనే వున్నారు' ముక్తసరిగా సమాధానం చెప్పింది.

'అలిగి వచ్చేశావేంటి' అనుమానంగా అడిగింది ప్రవీణ

'అలిగటమా .. నెవ్వర్... మూతి విగింపులు, అలకలు పాత పడిన విద్యలనీ ' అంటూ రాగయుక్తంగా పాడి నవ్వింది గర్వంగా వసుంధర

'అదోలా వుందే నీ ముఖం '

'నీ ముఖం ....అదేం లేదు'

'సర్లే కబుర్లేంటి.'

'కబుర్లేం ఖర్మ, కథలే చెప్తా నీకు వినే ఓపికుంటే.'

'అంత కథలే వుంటే చెప్పే బదులు వ్రాసి ఏ వారపత్రికకో పంపేయకూడదు. రచయిత్రివనిపించుకోవచ్చు. నాలుగు రాళ్ళు పోగేసుకోనూ వచ్చుకదా.

'అ ఆ ... పోగేస్తున్న నాలుగు రాళ్లు చాలు ఇంకా ఎందుకులే '

'ఏ ...డబ్బు చేదా ఏంటి..

'అబ్బ వూర్కే సుత్తిగొట్టి చంపకు నేనేదేదో చెప్పాలని వస్తే పత్రికలంటూ, కథలంటూ ఒకటే సోది.' విసుగ్గా అన్నది వసుంధర.

సర్సరే . నేనింకేం మాట్లాడనుగానీ నువ్వు చెప్పాలనుకున్న వన్నీ చెప్పు. నేవింటా' అంటూ సర్దుక్కూర్చుంది ప్రవీణ.

ఉదయం ఆఫీసుకు వెళ్లేటప్పుడే 'సాయంత్రం పెందలాడే వస్తాను. నువ్వు రెడీగా వుండు, సినిమాకి వెళ్దాం అని చెప్పి వెళ్ళారే మీా అన్నయ్యగారు. నర్లెమ్మని .... అంటూ ప్రారంభించి తను ప్రవీణ ఇంటికి చేరేవరకూ జరిగిన సంగతంతా; పూసగుచ్చినట్లు వైనంగా వివరించింది వసుంధర.

'అసలీ మగాళ్ళందరికీ సంపాయించుకు వస్తున్నాం కదా, ఏం మాట్లాడినా చెల్లుబాటవుతుందన్న పొగరే. కానీ నాకేం అంత ఖర్మబట్టింది. నేనూ సంపాయిస్తున్నాను నా కాళ్ళమీద నేను బ్రతగ్గలను. అందుకే మాటకు మాట ఎదురుచెప్పి తిరగబడ్డాను.'

'అందుకే ఆడవాళ్ళకు ఆర్థిక స్వాతంత్ర్యం వుండాలనేది. అప్పుడుగానీ ఈ మగాళ్ళ అహంకారం అణగదు కదూ.' అడిగింది వసుంధర.

'ఆ మాట నిజమే సంపాయిస్తున్నామనే అహంభావమూ, ఆర్థిక స్వేచ్ఛ వుందన్న ధీమా మగాడిచేత అలా మాట్లాడిస్తున్నయ్. కానీ ఇప్పుడింత చిన్న విషయానికి నువ్ అంతగా తిరగబడింది కూడా ఆ అహంకారంతోటే కదూ.'

'సంపాదననేది ఆడదానికొక్కడా అహంకారాన్ని తెచ్చిపెడుతున్నప్పుడిక మగాళ్ళని నిందించాల్సిన అవసరమేమున్నది.'

'ఆడదానికి ఆర్థిక స్వాతంత్ర్యం వుండాలన్నది మగాడు తనను అన్యాయం చేస్తే తనకు తానుగా బ్రతగ్గలగాలనిగానీ తనకు తానే అన్యాయం చేసుకునేందుకొక్కాదు. ఏమంటావ్.'

'ఇది అహంకారం కాదు. ఆత్మాభిమానం.'

'అది అహంకారానికి నువ్వు పెట్టుకున్న ముద్దు పేరు మాత్రమే. ఆలోచించు ఈ రాత్రంతా తీరిగ్గా.' అన్నది ప్రవీణ.

ఆలోచనలో పడింది పాపం వసుంధర.

'ఇప్పుడూ నేనిలా ప్రవర్తిస్తే సంపాయిస్తున్నదనే అహంకార మనేగా అందరూ అనుకుంటారు. అయినా ఒకళ్ళు అనుకోవటం కాదుగానీ నిజంకూడా అంతేనేమో!' అనే తన ఆలోచనకు ఉలిక్కి పడింది వసుంధర.

'సంపాదన మూలంగా అధిక్యత రావాలని కోరుకోవటం గానీ అధికారం చలాయించాలనుకోవటంగానీ, అహంభావం ప్రద ర్శించటంగానీ వాస్తవమైతే ఆడ కయినా, మగ కయినా ఒకటే నన్నమాట.'

'సంపాయిస్తున్నాను కాబట్టి, అయినదానికీ కానిదానికి ఎదురు తిరగటం, నా మాటే నెగ్గాలనుకోవటం అనుచితం' అనుకుని తృప్తిగా నిద్రలోకి జారుకుంది వసుంధర.

ఉదయాన్నే ఇంటికి ప్రయాణమైన వసుంధరకి దారిలో తన కోసమే వస్తున్న రామారావు చిరునవ్వుతో ఎదురయ్యాడు.

'ఇంకాసేపు బయల్దేరకుండా వుంటే బాగుండేదేమో' అను కున్నారు ఆలుమగలిద్దరూ ఎవరి మనసులో వారే.

— o —